విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 128 | మంగళవారం 08. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00





# సోమవారం అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతలకు దారితీసింది

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ విపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు తలపెట్టిన 'చలో అసెంబ్లీ'
- అసెంబ్లీ ముట్టడికి బీజేపీ శ్రేణులు, నిరుద్యోగ జేఏసీ నాయకులు యత్నం
- పటిష్ట బందోబస్తును ఛేదించుకుని విడతలవారీగా అసెంబ్లీ వైపు వెళ్లిన ఆందోళనకారులు
- పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టు
- రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి..
- బీజేపీ కార్యకర్తలు విడివిడిగా, వ్యూహాత్మకంగా వివిధ మార్గాల గుండా అసెంబ్లీకి రావడంతో పోలీసులు వారిని నిలువరించేందుకు తీవ్రంగా ప్రయత్నం
- అసెంబ్లీ ముట్టడికి ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా కార్యకర్త ప్రయత్నం
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ప్లకార్డులు ప్రదర్శన
- అసెంబ్లీ సమావేశాల మొదటి రోజే ప్రతిపక్షాల ముట్టడి పిలుపుతో నగరంలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలోనూ పోలీసులు హైఅలర్ట్
- అసెంబ్లీ గేటు వద్ద తాతా మధు ఓవరాక్షన్.. పోలీసులు, స్పీకర్‌పై బండ బూతులు
- ఎమ్మెల్యే మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్
- ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం

హైదరాబాద్:(తెలంగాణ వాణి)

తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతలకు దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ విపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు తలపెట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమంతో హైదరాబాద్‌లో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ముట్టడికి బీజేపీ శ్రేణులు, నిరుద్యోగ జేఏసీ నాయకులు యత్నించారు. అయితే పటిష్ట బందోబస్తును ఛేదించుకుని విడతలవారీగా అసెంబ్లీ వైపు వెళ్లిన ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టు చేశారు. సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణితో పాటు ఎల్‌బీ నగర్ ప్రాంతానికి చెందిన బీజేపీ నేత సామ రంగారెడ్డి తదితరులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ కార్యకర్తలు విడివిడిగా, వ్యూహాత్మకంగా వివిధ మార్గాల గుండా అసెంబ్లీకి రావడంతో పోలీసులు వారిని నిలువరించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

అసెంబ్లీ ముట్టడికి ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా కార్యకర్త ప్రయత్నం చేశారు. అయితే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడటమే స్థానికంగా కలకలం రేపింది. అసెంబ్లీ ముఖద్వారం వద్ద ఆమె తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించారు. అక్కడే అప్రమత్తంగా ఉన్న భద్రతా సిబ్బంది, పోలీసులు ఆమెను అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

**నిరుద్యోగ జేఏసీ నిరసన..**

మరోవైపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ప్లకార్డులు ప్రదర్శించింది. ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని, జాబ్ కాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో నిరుద్యోగ జేఏసీ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు.

**మొదటి రోజే హై అలర్ట్**

అసెంబ్లీ సమావేశాల మొదటి రోజే ప్రతిపక్షాల ముట్టడి పిలుపుతో నగరంలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలోనూ పోలీసులు హైఅలర్ట్ ప్రకటిం చారు. అసెంబ్లీకి వెళ్లే అన్ని మార్గాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. ఆందోళనకారులను ఎక్కడికక్కడే అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో అసెంబ్లీ సమావేశాల వేళ ప్రతిపక్షాల నిరసనలు చర్చయాంశంగా మారాయి.

## స్పీకర్‌పై జుగుప్సాకరమైన భాష..



- తాతా మధును డిస్మిస్ చేయాలి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- "ఈరోజు నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది.
- బీఆర్ఎస్ సభ్యులను నిన్న కేసీఆర్ పిలిపించుకుని నేడు స్పీకర్ పైకి ఉసిగొల్పారు.
- ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు..
- పథకం ప్రకారం జరిగిందే. సభాపతికి జరిగిన అవమానం..
- సభ్య సమాజానికి జరిగిన అవమానం. స్పీకర్‌పై జుగుప్సాకరమైన భాష ఉపయోగించడమేంటి?
- దళితులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్. దళితుడిని సీఎం చేస్తానని,
- వారికి మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన.
- సభాపతికి జరిగిన అవమానం.. మా అందరికీ జరిగినట్లు భావిస్తున్నాం.



## తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి

హైదరాబాద్:(తెలంగాణ వాణి)

తెలంగాణ శాసనసభ గడ్డం స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి పెట్టుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండిస్తూ శాసన సభలో మంత్రి సీతక్క మాట్లాడారు. స్పీకర్ తల్లిని అవమానించడం బాధాకరమన్నారు. ఈ సమయంలో స్పీకర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు బాధాకరమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శాసన సభ వాయిదా పడిన అనంతరం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. "సీతక్క ఐదేళ్లుగా నాకు రాఖీ కడుతున్నారు. సభలో ఆమె కన్నీరు పెట్టుకుంటే నాకు దుఃఖం ఆగలేదు. తాతా మధు వ్యాఖ్యలపై శాసనసభ తీర్మానం చేసి మండలికి పంపిస్తాం"అని స్పీకర్ తెలిపారు.

## వ్యతిరేక ఓట్లను గుర్తించేందుకు బీజేపీ స్పెషల్ ఏజెన్సీలను పెట్టుకుంది..



- తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్
- 2009 నుంచి ఓటింగ్ సరళని పరిశీలించి బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగిస్తున్నారు.
- నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ అంతా సిద్ధమవుతోంది
- ఎస్ఐఆర్ రూపంలో కొత్త కుట్రలు తెరలేపారు
- రవీంద్రభారతిలో ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం

## తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు అరెస్ట్



తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తీవ్ర ఉద్రిక్తత, తోపులాట చోటు చేసుకున్నాయి. ఇవాళ ఉదయం నుంచి దశలవారీగా అసెంబ్లీ ముట్టడికి వస్తున్న కమలం పార్టీ శ్రేణులను పోలీసులు ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ అరెస్టులు చేస్తున్నారు. అసెంబ్లీ ముట్టడికి రామచందర్ రావు రావడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను పోలీసులు తరలిస్తుండగా బీజేవైఎం శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుని తీసుకెళ్తున్న పోలీసు వాహనంపైకి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఎక్కడంతో పోలీసులు ఆయనను కిందకు లాగేశారు. కార్యకర్తలు వాహనానికి అడ్డంగా పడుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈ తోపులాటలో పలువురు బీజేపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొందరి చేతులు విరగడంతో వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసెంబ్లీ వద్ద భారీగా పోలీసులను మోహరించడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది.

# బాజీరెడ్డి రాకతో బాన్సువాడ నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణలు

- బిఆర్ఎస్ అధిష్టానానికి టార్గెట్ గా మారిన పోచారం
- కాంగ్రెస్ పార్టీలో ఏనుగు రవీందర్ రెడ్డి
- కాసుల బాలరాజుల మధ్య గ్రూపు తగాదాలు ఉన్నాయి
- బిజెపి అభ్యర్థి ఎండల స్థానికేతురుడని నియోజకవర్గ ప్రజల తిరస్కరణ



పోచారం శ్రీనివాస్ రెడ్డి



ఏనుగు రవీందర్ రెడ్డి



బాజిరెడ్డి గోవర్ధన్

**హైదరాబాద్ సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టిఎన్ రమేష్)**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. గత 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి బీఫామ్ ఆశించిన కాసుల బాలరాజు బీఫామ్ దక్కకపోవడంతో పురుగుల మందు సేవించి ఆసుపత్రి పాలయ్యారు. ఈ సంఘటన రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర దుమారాన్ని రేపింది. కారణం ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఏనుగు రవీందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ తరపున 4 పర్యాయాలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగారు. 2018 ఎన్నికల్లో ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జాజాల సురేందర్ 35 వేల భారీ మెజారిటీతో గెలుపొందడం జరిగింది. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో, కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల అప్పటి అధికార పార్టీ బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో తన ప్రత్యర్థి అయినటువంటి జాజాల సురేందర్ ను బిఆర్ఎస్ అధిష్టానం పార్టీలోకి తీసుకోవడంతో, మింగుడు పడని ఏనుగు రవీందర్ రెడ్డి (బిఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం నుండి ఓటమి చెంది) బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాలక్రమేణ 2023లో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఫామ్ మదన్ మోహన్ రావు కు, కేటాయించడం జరిగింది. అనుకున్న విధంగానే మదన్ మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ బీఫాంతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా 2023 కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఆశించిన ఏనుగు రవీందర్ రెడ్డికి బాన్సువాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించడం జరిగింది. దీంతో గత కొన్ని పర్యాయాలుగా బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడుగా ఉన్న బీసీ నేత కాసుల బాలరాజు తనకు కేటాయించవలసిన బిఫామ్ ఏనుగు రవీందర్ రెడ్డి కి కేటాయించడంతో, తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం రాజకీయాలలో సంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీలోని పెద్దలు కాసుల బాలరాజును ఆసుపత్రిలో పరామర్శించి, పార్టీ అధికారంలోకి రాగానే, సముచిత స్థానాన్ని కట్టబెడతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల హామీ మేరకు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాసుల బాలరాజుకు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ పదవిని (రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్ట్) ఇవ్వడం జరిగింది. 2023 ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో కాసుల బాలరాజ్ వర్సెస్ ఏనుగు రవీందర్ రెడ్డి ఇద్దరు నాయకులకు సంబంధించి, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు గ్రూపులుగా ఏర్పడి హామీ తుమీ అనుకోవడంతో, బాన్సువాడ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి గెలుపును కైవసం చేసుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రెండవ స్థానానికి పడిపోగా, నిజామాబాద్ నగరానికి చెందిన బిజెపి నాయకుడు ఎండల లక్ష్మీనారాయణ బాన్సువాడ నియోజకవర్గం నుంచి బిజెపి తరపున బరిలోకి దిగి, పార్టీ ఓటు బ్యాంకు తప్ప ప్రజల మన్ననలు పొందలేకపోయారు. గత కొద్ది కాలంగా బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆ పార్టీకి అంటి ముట్టనట్లుగా ఉండడంతో, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ తో పాటుగా పార్టీలోని బలమైన నాయకులందరూ, పోచారం శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని, ఆయనకు పార్టీలో కేసీఆర్ తర్వాత అంతటి స్థానాన్ని కల్పించినప్పటికీ, ఆయన తన స్వలాభపేక్ష కోసం కాంగ్రెస్ పార్టీకి దాస్యం చేస్తున్నారని తీవ్రస్థాయిలో దుయ్యబడ్డారు. ఇక రానున్న ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఎలాగైనా ఓడించాలని, దృఢ సంకల్పంతో కేసీఆర్ సహా, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు దృఢ సంకల్పంతో ఉన్నట్లు విశ్వాసనీయ సమాచారం. రాజకీయ దురంధరుడైన పోచారం శ్రీనివాస్ రెడ్డి రానున్న ఎన్నికలలో భాగంగా గెలుపే ధ్యేయంగా, ఇప్పటికే, తన నమ్మకబంటులైనటు వంటి కొందరు ద్వితీయ శ్రేణి నాయకులను, కాంగ్రెస్, బి ఆర్ ఎస్, పార్టీల లోకి ప్రవేశపెట్టినట్లు, వారి ద్వారా కోవర్ట్ ఆపరేషన్ చేయించేందుకు కసరత్తు చేస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికే దెబ్బతిని గాయపడ్డ బిఆర్ఎస్ అధినాయకత్వం, పోచారానికి ధీటైన నాయకుడిని బాన్సువాడ బరిలో దించి, పోచారం శ్రీనివాస్ రెడ్డిని రాజకీయంగా మట్టి కరిపించాలని, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ మాజీ ఎమ్మెల్యేగా పలుమార్లు విజయ దుందుభి మోగించిన బాజిరెడ్డి గోవర్ధన్ కు బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పగ్గాలు అప్పగించినట్లు విశ్వాసనీయ సమాచారం. బాజీ రెడ్డి సైతం ఇప్పటికే పలుమార్లు బాన్సువాడ నియోజకవర్గ బి ఆర్ ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో పలుమార్లు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. బిఆర్ఎస్ శ్రేణులలో నూతన ఉత్తేజాన్ని నింపుతూ, తాను ఉన్నానని పార్టీ శ్రేణులు నిరుత్సాహపడవద్దని, కార్యకర్తలకు భరోసా ఇవ్వడం జరిగింది. బాజిరెడ్డి గోవర్ధన్ రాకతో బాన్సువాడ రాజకీయాలు వేడెక్కాయనే చెప్పవచ్చు. వచ్చే ఎన్నికలలో రాజకీయ అతిరథుల మధ్య హోరాహోరి పోటీ కొనసాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**కల్వేర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
: కల్వేర్ మండలం మాసాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కామధేను ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ పుంజాల వెంకటేష్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులకు అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. మండల విద్యాధికారి బి.సురేష్ అభ్యర్థన మేరకు తొలిసారిగా కల్వేర్ మండలంలోని విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**రాయికల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సులోచన డిమాండ్ చేశారు. సోమవారం రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ఆవరణలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికుల బిల్లులను ప్రతినెలా సకాలంలో చెల్లించాలని, భోజన తయారీకి అవసరమైన గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిధులు పెంచాలని, ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు రిటైర్మెంట్ అనంతరం ప్రయోజనాలు కల్పించాలని కోరారు. సమావేశంలో కార్మికుల కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి




**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణికి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు రామావత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు, రూ.500కే గ్యాస్ తదితర హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల తీరుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవరకొండ డివిజన్ సబ్ కలెక్టర్ గా కరోలిన్ చింగ్ తీయాన్ మావి బాధ్యతల స్వీకరణ

**దేవరకొండ సెప్టెంబర్ 7( తెలంగాణ వాణి ప్రతినిధి)**



దేవరకొండ రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ గా ఐఏఎస్ అధికారి కరోలిన్ చింగ్ తీయాన్ మావి సోమవారం బాధితులు స్వీకరించారు. ఇక్కడ నిధులు నిర్వహించిన ఆర్డీవో పద్మప్రియ బదిలీ కావడంతో ప్రభుత్వం ఈ స్థానంలో సబ్ కలెక్టర్ హోదా అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతనధికారికి ఘనంగా స్వాగతం పలికారు.

## విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు




**ధర్మారం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఐ--కెనడా) ఆధ్వర్యంలో ధర్మారం మండలం మల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ఆదివారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో మొత్తం 512 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 108 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం అభ్యర్థన మేరకు ఫౌండేషన్ ఈ శిబిరం నిర్వహించింది. కంటి అద్దాలు అవసరమైన 108 మంది విద్యార్థులకు త్వరలో ఉచితంగా అద్దాలు అందజేస్తామని దామోదర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, మాజీ పేరెంట్స్ కమిటీ సభ్యులు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డిండి ప్రాజెక్టును వెంటనే నింపాలి

**నీళ్ల విషయంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది : రవీంద్రకుమార్**

**డిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: డిండి ప్రాజెక్టును కేఎల్ఐ ద్వారా వెంటనే నింపి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం డిండి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. సాగునీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేఎల్ఐ ద్వారా డిండి ప్రాజెక్టును నింపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం డిండి ప్రాజెక్టు, ఆయకట్టు రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రాజెక్టును కేఎల్ఐ ద్వారా నింపే వరకు, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




# నివాసాల మధ్య డంపింగ్ యార్డు తొలగించాలి

- **చెత్త తగులబెట్టడంతో రోగాల బారిన జనం**
- **స్మశానవాటిక సమస్యను వెంటనే పరిష్కరించాలి**
- **సిపిఐ 1 టౌన్ కార్యదర్శి నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని సిపిఐ 1 టౌన్ కార్యదర్శి నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం నివాసాల సమీపంలో కార్పొరేషన్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారంటూ స్థానిక ప్రజలతో కలిసి యార్డు వద్ద సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నివసించే నివాసాల చెంతనే యార్డును ఏర్పాటు చేసి రోజూ చెత్తను తగులబెడుతుండటంతో వెలువడుతున్న విషవాయువుల వల్ల స్థానికులు తీవ్రమైన ఊపిరితిత్తుల, చర్మ సంబంధిత అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం శ్మశానవాటికకు వెళ్లే రహదారికి




సైతం అడ్డంగా చెత్తను కుప్పలుగా వేయడంతో, మృతదేహాలను దహనం, ఖననం చేసేందుకు స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు. శవాలను డంపింగ్ యార్డు ఇవతలనే ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం మానుకొని, డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించకపోతే కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భవాని ప్రసాద్, నాగరాజు, బండి మంగ, అరుణ, రామ్మూర్తి, రామారావు, సరోజిని, సాయి, మంద బాబు, రాంపండు, వెంకట్ పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు: అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్

రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాలను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక ఉత్సవాలు సెప్టెంబర్ 25న గణేష్ విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో ఇవాళ పోలీసు కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్ఐలు, సీనియర్ పోలీసు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వినాయక మండపాల వివరాలు, నిర్వాహకుల సమాచారం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనాల వివరాలను నమోదు చేసి పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఈ పోర్టల్ ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించాలని, సీపీలు, డీసీపీలు, ఎస్పీలు స్వయంగా మండపాలను సందర్శించి పాయింట్ బుక్స్‌లో తమ పరిశీలనలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇక విద్యుత్, అగ్నిమాపక శాఖల సహకారంతో మండపాల వద్ద




విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద స్వచ్ఛంద సేవకులు సీసీటీవీ కెమెరాలు, క్యూ లైన్ల భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. మండపాల లొకేషన్లు, భద్రతా ప్రమాణాలను రికార్డు చేయడానికి జియో-ట్యాగింగ్‌ను ఉపయోగించాలని సూచించారు. బాంబ్ డిటెక్షన్ బృందాలు, డాగ్ స్క్వాడ్ల ద్వారా తనిఖీలు నిర్వహించి, ఆ వివరాలను ప్లాట్‌ఫారమ్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 25న జరిగే శోభాయాత్ర, నిమజ్జనం కోసం వినియోగించే మార్గాలు, రోడ్లు, వంతెనల సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేసి రవాణా, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లపై నిరంతరం దృష్టి సారించాలని, తప్పుడు ప్రచారాలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. శాంతి కమిటీలు, గణేష్ ఉత్సవ సమితులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని, బందోబస్తు విధుల్లో ఉండే పోలీసు సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సాంకేతిక విభాగాధిపతి వీ.వీ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో 78 కోట్ల దండుకొని మోసం




**రెవెన్యూ ఉద్యోగి భద్రాచలం ఎమ్మెల్యే పీఏ అరెస్టు**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీటీపీఎస్, ఐటీసీలలో ఉద్యోగాలిప్పిస్తామని 54 మంది వద్ద నుంచి సుమారు 78 కోట్లు వసూలు చేసి మోసగించిన రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్, భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కోర్ల కళ్యాణ్ ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించారు. ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్లో నష్టపోయిన డబ్బు కోసమే ఈ మోసానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు. మోసగాళ్లు, బెట్టింగ్ యాప్లపై అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## తప్పుడు పత్రాలతో కబ్జా యత్నం

- **చర్యలు తీసుకోండి**
- **ప్రాణభయంతో వృద్ధురాలు బానోత్ మంగమ్మ వేడుకోలు**

**చుంచుపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**



ఒంటరి మహిళనైన తనకు ప్రాణహాని ఉందని చుంచుపల్లి మండలానికి చెందిన బానోత్ మంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బృందావనం ప్రాంతంలోని తనకు సంబంధించిన విలువైన 1 ఎకరం 10 గుంటల భూమి విషయంలో కొంతకాలంగా తనను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. తన భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు కొందరు తప్పుడు పత్రాలను సృష్టించి వాటిని అడ్డుపెట్టుకుని ప్రయత్నిస్తున్నారని మంగమ్మ పేర్కొన్నారు. భూమిపై తన హక్కులను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న తనపై పదేపదే తప్పుడు కేసులు పెట్టి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఒంటరి మహిళ అయిన తనను లక్ష్యంగా చేసుకుని ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు మద్దత్తుగా న్యాయం చేయాలని ఎవరైనా ముందుకు వచ్చి ఇదేంటని ప్రశ్నించే వారినీ వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. తన భూమికి సంబంధించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించాలని, తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని బానోత్ మంగమ్మ విజ్ఞప్తి చేశారు. తనకు ప్రాణహాని ఉందన్న విషయాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించి తనకు తగిన భద్రత కల్పించాలని కోరారు.

## ఎస్ఐఆర్ నోటీసులు, విచారణ పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి**



**నిజామాబాద్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీల్లో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం పారదర్శకంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. నోటీసుల జారీ, పంపిణీ, విచారణపై జిల్లాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లకు విచారణకు తగిన సమయం కల్పించి, వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ప్రతి కేసు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొనసాగుతోందని జిల్లా పాలనాధికారి భవేష్ మిశ్రా తెలిపారు. నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధుపై చర్యలు తీసుకోవాలి



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పరీయుద్దీన్ డిమాండ్ చేశారు. దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ అహంకార వైఖరికి నిదర్శనమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుపై ఎమ్మెల్యే సురేందర్ చేస్తున్న విమర్శలను ఖండించారు. అభివృద్ధిపై అనవసర వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ఎంపీడీవోల లాగిన్ ద్వారా లబ్ధిదారుల వివరాలను వెంటనే ఉన్నతాధికారులకు పంపాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఉండాలి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

బాధితులకు న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యతని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి 33 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, సత్వరమే విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని 8712659973 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి



**మంచిర్యాల, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్--2026 ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కలిసి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు 1.70 లక్షల నోటీసులు జనరేట్ కాగా, 1.10 లక్షల నోటీసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన నోటీసుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లకు నోటీసులు, పత్రాల సమర్పణపై శిక్షణ ఇవ్వాలని, నో మ్యాపింగ్, అనామలీస్, ఏఎస్‌డీ జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా హక్కును కోల్పోకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నస్పూర్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు.

## ఎస్ఐఆర్‌లో పూర్తి పారదర్శకత పాటించాలి

- అర్హులందరికీ ఓటు హక్కు
- అనర్హుల పేర్ల తొలగింపు
- జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ యోగితా రాణా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ డా. యోగితా రాణా అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాజర్షి షాతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. 2002, 1984 నాటి రికార్డులు, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధ్రువీకరించాలని సూచించారు. బీఎల్ఏలు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. 4,66,784 మంది ఓటర్లలో 3,86,015 మంది వివరాలను మ్యాపింగ్ చేసినట్లు వెల్లడించారు. డ్రాఫ్ట్ జాబితాలో 4,03,625 మంది ఓటర్లు ఉన్నారని, పోస్ట్ డ్రాఫ్ట్ దశలో 1,50,425 నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లపై రూ.10 భారం.. అధికారుల మౌనం

**మంచిర్యాల, సెప్టెంబర్ 07 (తెలంగాణ వాణి):**

పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్ల నుంచి ఒక్కో ఆటోకు రూ.10 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజంతా ఆటో నడిపి వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకునే డ్రైవర్లపై ఈ అదనపు భారం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ఆటోలు ఈ ప్రాంతానికి రాకపోకలు సాగిస్తుండటంతో ఒక్కో ఆటో నుంచి రూ.10 చొప్పున వసూలు చేస్తే భారీ మొత్తంలో డబ్బులు సమకూరుతున్నాయని డ్రైవర్లు పేర్కొంటున్నారు. అయితే ఈ వసూళ్లు ఏ నిబంధనల ప్రకారం జరుగుతున్నాయి? సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? వసూలు చేసిన మొత్తానికి రసీదులు ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వసూళ్ల వ్యవహారంపై ఆరోపణలు, ఫిర్యాదులు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పష్టంగా స్పందించక పోవడంపై ఆటో డ్రైవర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు వసూళ్లు చేస్తున్నట్లయితే వారిపై చర్యలు తీసుకోవాలని, అధికారిక వసూళ్లు అయితే నిబంధనలు, అనుమతుల వివరాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో




విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని స్థానిక ఆటో డ్రైవర్ గుత్తుల దుర్గ మహేష్ కోరారు. అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే వెంటనే అడ్డుకోవాలని, రోజువారీ కూలీపై ఆధారపడే ఆటో డ్రైవర్లపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బెల్లంపల్లి చౌరస్తాలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.10 వసూళ్లపై అధికా రులు ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



## ప్రభుత్వ హామీల అమలు ఏమైంది: బీఆర్ఎస్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఏమైందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో నిరసన చేపట్టి, అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పింఛన్ల పెంపు, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, ఇతర హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల వ్యవహారాన్ని ఖండించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా తిరుపతి

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి).**



ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్)గా తిరుపతి సోమవారం ఏడీ కార్యాల యంలో ఉద్యోగ బాధ్య తలు చేపట్టారు. కాగా, హనుమ కొండ కార్పొరేట్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన నూతన ఏడీఈ లక్షెట్టిపేట డివిజన్‌లోని దండేపల్లి, జన్నారం, లక్షెట ్టిపేట మండ లాలను పర్యవేక్షిస్తారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఏడీఈ ప్రభాకర్ ప్రమో షన్‌లో బెల్లం పల్లికి బదిలీ అయ్యారు. నూతన ఏడీఈ తిరుపతిని సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

**రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మాణం**



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేశారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 420 హామీలను వెంటనే అమలు చేయాలి

**ప్రజావాణిలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు**



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను పూరి _స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, గృహిణులకు రూ.2,500, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో తులం బంగారం వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జలంధర్‌రెడ్డి, ఎగుల నర్సింలు, శ్రవణ్, గోపాల్, రవి, సాయిలు, పృథ్వీరాజ్, వాహబ్, బబ్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

ప్రజల సమస్యలకు పారదర్శకంగా, సత్వర పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకున్న ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని న్యాయం అందించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తామని తెలిపారు.



## చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం, అటవీశాఖ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వనజారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు.

## మంత్రి వివేక్‌పై విమర్శలు సరికావు



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 07 (తెలంగాణ వాణి)**

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. బాల్క సుమన్ పదేళ్లలో చెన్నూరు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. మంత్రి వివేక్ ఆధ్వర్యంలో చెన్నూరులో వందల కోట్లతో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతోందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని బాల్క సుమన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 116 ఫిర్యాదులు



**నిజామాబాద్, సెప్టెంబర్ 07 :(తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్మల్ బ్రాంచ్ వారి వితరణ




**నిర్మల్, సెప్టెంబరు 07(తెలంగాణ వాణి ప్రతినిధి)**

నిర్మల్ పట్టణం శాంతినగర్ లోని మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జడ్డి పోశెట్టి తన మిత్రుడు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్మల్ బ్రాంచ్ మేనేజర్ అనూష్ ని కలిసి పాఠశాల లోని సమస్యల గురించి విన్నవించగా తక్షణమే స్పందించి 12వేల రూపాయలు విలువ గల టేబుల్స్, కుర్చీలు ఫ్యాన్లు అందించడం జరిగింది. అదేవిధంగా ఆర్ఓ ప్లాంట్ ను అందించడానికి ప్రయత్నం చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీ అనూష్ మరియు సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు లావణ్య మరియు జడ్డి పోశెట్టి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బందిని ఉపాధ్యాయులు అభినందిస్తూ సన్మానించడం జరిగింది.



## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే

**నిర్మల్--తానూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: తానూర్ మండలం అంగీర్గా గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో దశలోనూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని, ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటిని అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పోశెట్టి, బాలాజీ, కాంగ్రెస్ నాయకుడు బాబూరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
: రానున్న వినాయక ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, సహోదరభావంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు పారిశుద్ధ్య ఏర్పాట్లు, రోడ్లపై గుంతల పూడ్చివేత, నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్వాహకులు కూడా తగిన జాగ్రత్తలు పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్, శాంతి కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## స్కావెంజర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

**కనీస వేతనం రూ.16,500కు పెంచాలి: సీఐటీయూ**



**నిర్మల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న స్కావెంజర్స్ కార్మికులను అన్‌స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. జీవో నెం.60 ప్రకారం కనీస వేతనాన్ని రూ.16,500కు పెంచాలని, వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలో పారదర్శకంగా హాజరు నమోదు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో స్కావెంజర్స్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్కావెంజర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగాధర్, అధ్యక్షుడు నారాయణ కోరారు. కార్యక్రమంలో పోశెట్టి, లక్ష్మి, రాజేశ్వర్, సంగీత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక సమస్యకు పలు శాఖల ప్రమేయం ఉంటే అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్వో రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తాతా మధుసూదన్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలి

**దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: పెండెం రామానంద్**

**నర్సంపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. తాతా మధుసూదన్‌ను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేటలోని అమరవీరుల స్తూపం వద్ద కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, బీఆర్ఎస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత, అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కారం కాదన్నారు. తాతా మధుసూదన్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని



బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల సాంబారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, మండల అధ్యక్షుడు కత్తి కిరణ్‌గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలుపై గళమెత్తిన శంషాబాద్ రాజు

**నివారణాత్మక చర్యల్లో భాగంగా పోలీసుల అరెస్ట్**




**తెల్లాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై నిరసన తెలిపేందుకు ధర్నా చౌక్‌కు వెళ్తున్న తెల్లాపూర్ బీజేపీ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ శంషాబాద్ రాజును పోలీసులు నివారణాత్మక చర్యల్లో భాగంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ రాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం తమ హక్కని, అరెస్టులతో తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజలు, విద్యార్థుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**



**వనపర్తి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీసు అధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. సోమవారం పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గణేష్ మండపాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించడంతోపాటు సోషల్ మీడియాలో వదంతులు, రెచ్చగొట్టే ప్రచారంపై నిఘా పెట్టాలని తెలిపారు. నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వనపర్తి ఎస్పీ సునితారెడ్డి, అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు దక్కిందేమిటి?

**420 హామీలను అమలు చేయాలి: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి**



**నారాయణపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నారాయణపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం, దాడులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్యలని ఖండించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, కార్మికులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆధ్వర్యంలో సన్మానం



**వనపర్తి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్‌ను కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'బొమ్మలపల్లకి ప్రతిభా పురస్కార సభ'కు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలపై నిర్వహించిన వీడియోగ్రఫీ పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో శంకర్‌గౌడ్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనను మణికొండ వేదకుమార్, డా. ఈమని శివనాగిరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ సన్మానించారు. కార్యక్రమంలో పలువురు చరిత్ర పరిశోధకులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా నేత రాజేందర్‌రెడ్డి అరెస్ట్

**నివారణాత్మక చర్యల్లో భాగంగా పోలీసుల అదుపులోకి**



**తెల్లాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ నిరసన తెలిపేందుకు ధర్నా చౌక్‌కు వెళ్తున్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డిని పోలీసులు నివారణాత్మక చర్యల్లో భాగంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజల సమస్యలపై ప్రశ్నించడం తమ బాధ్యత అన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరని, ప్రభుత్వం హామీలను అమలు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## వినాయక నిమజ్జనానికి చెరువుల పరిశీలన

**మాదన్నపేట చెరువులో నిమజ్జన ఏర్పాట్లు: చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్**



**నర్సంపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ సోమవారం దామర చెరువు, మాదన్నపేట చెరువులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, టౌన్ సీఐ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. దామర చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మాదన్నపేట చెరువులో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. అధికారులు, గ్రామస్తుల సహకారంతో నిమజ్జనం సజావుగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సాధ్యమైనంత వరకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ కమిటీలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలు, జాతరల్లో పోలీసుల వ్యవహారశైలిపై శిక్షణ

**వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత**

**హనుమకొండ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**




పండుగలు, జాతరలు, ఊరేగింపుల సందర్భంగా భారీ జనసమూహాల వద్ద విధులు నిర్వహించే పోలీసులు ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ అందిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రంలో భద్రాద్రి జోనల్ పరిధిలోని పోలీస్ శిక్షకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 43 మంది ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. పండుగలు, జాతరలు, ఊరేగింపుల సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించడంపై తరగతులతో పాటు ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. శిక్షణ పొందిన వారు తమ జిల్లాల్లోని పోలీసులకు ఇదే విధంగా శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు.

## పాలకీడు మండలంలో 12 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



**పాలకీడు, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలో 2026--27 విద్యా సంవత్సరానికి 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జానపాడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి సమక్షంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు మాట్లాడుతూ ఈ గుర్తింపు తమకు ఎంతో గర్వకారణమని, భవిష్యత్‌లోనూ విధి నిర్వహణలో మరింత నిబద్ధతతో పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలు ఎక్కడ?

**అధికారులకు బీఆర్ఎస్ నేతల వినతి**



**తెల్లాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద డివిజన్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైస్‌మిల్ కాలుష్యంపై సంయుక్త తనిఖీ చేపట్టాలి

**ప్రజల ఆరోగ్యం, రైతుల ప్రయోజనాలను కాపాడాలి: మేకల అశోక్**



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
కంబాళాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 74లో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ వారాహి బాయిలర్ రైస్‌మిల్ నుంచి వెలువడుతున్న వ్యర్థజలం, బాయిలర్ బూడిద, పొగ, దుమ్ముతో పరిసరాల్లో కాలుష్యం ఏర్పడుతున్నట్లు రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకుడు మేకల అశోక్ తెలిపారు. మిల్ వ్యర్థజలం వాగులో కలుస్తుండటంతో సుమారు 100 ఎకరాల సాగుభూములకు నష్టం జరుగుతోందని, బోరు నీటి నాణ్యతపైనా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలకు వినతిపత్రాలు అందజేసి, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ, వైద్య--ఆరోగ్య, భూగర్భజల, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి నీరు, మట్టి, వ్యర్థజలం, గాలి నమూనాలను పరీక్షించాలని డిమాండ్ చేశారు. నిబంధనల ఉల్లంఘన తేలితే చర్యలు తీసుకుని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే రైతులు, గ్రామస్థులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### ఆర్డీవోకు బీఆర్ఎస్ నేతల వినతిపత్రం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడి, సర్వీస్ రోడ్లపై వాహనాల రద్దీ పెరుగుతోందని తెలిపారు. వారాంతాలు, సెలవు రోజుల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరాటం

### జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్ అరెస్ట్

**తెల్లాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చౌక్‌కు వెళ్తున్న జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్‌ను పోలీసులు నివారణాత్మక చర్యల్లో భాగంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై న్యాయం కోరడం నేరం కాదన్నారు. ప్రజా సమస్యలపై తమ గొంతును అణచలేరని, విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (సెప్టెంబర్ 7 ):**
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు.మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు.రాస్తారోకోతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొనగా,పోలీసులు వినయ్ భాస్కర్ తో పాటు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలను అరెస్టు చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత విమర్శలు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**మానకొండూరు, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
రాజకీయ నాయకులు వ్యక్తిగత విమర్శలు, పరుష పదజాలానికి దూరంగా ఉండి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెన్నమల్ల చైతన్య సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరస్పర విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అధికారంలో ఉన్న వారు తమ పదవులను ఉపయోగించి నియోజకవర్గానికి నిధులు, అభివృద్ధి పనులు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఎవరు ఏమి మాట్లాడారన్నది కాకుండా, ఎవరు ఏం అభివృద్ధి చేశారు, ఇకపై ఏం చేయబోతున్నారన్నదే ముఖ్యమన్నారు.– మానకొండూరు ప్రజలు మాటల రాజకీయాలు కాకుండా చేతల రాజకీయాలను కోరుకుంటున్నారని, ప్రజా సమస్యలపై తమ పార్టీ నిరంతరం ప్రశ్నిస్తుందని చైతన్య తెలిపారు.




## కవ్వంపల్లి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



**శంకరపట్నం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం శంకరపట్నం మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేశపట్నం జాతీయ రహదారిపై ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ, దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం అప్రజాస్వామికం

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గాజులరామారం మహాదేవపురం చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని, అసెంబ్లీ సమావేశాలను మరో 30 రోజులు పొడిగించి ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు.



అనంతరం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిలుకూరు బీజేపీ నాయకులు ముందస్తు అరెస్ట్

**ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చలో ఇందిరాపార్క్**

**చిలుకూరు, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో ఇందిరాపార్క్ ధర్నాకు వెళ్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పొరెల్లి మహేశ్ ఖండించారు. శాంతియుత నిరసనకు వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. చిలుకూరు నుంచి వెళ్తున్న రెండు వాహనాలను తెల్లవారుజామున మార్గమధ్యలో అడ్డుకుని అరెస్ట్ చేశారని తెలిపారు. అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని మహేశ్ స్పష్టం చేశారు. అరెస్టయిన వారిలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు మోదుగు శ్రీనివాసరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్,




జడ్పీటీసీ ఎన్నికల కన్వీనర్ తిపిరిశెట్టి బసవయ్య, మండల ప్రధాన కార్యదర్శులు రామినేని నరసింహవర్మ, కొండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వన్నాపురం సతీష్, బేతవోలు గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగ సురేష్, దళిత మోర్చా నాయకుడు మీసాల మట్టయ్య తదితరులు ఉన్నారు.

## హామీలను వెంటనే అమలు చేయాలి

**వనపర్తి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు, వివిధ డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజా సంక్షేమం నిర్లక్ష్యానికి గురైందని ఆరోపిస్తూ సోమవారం అడిషనల్ కలెక్టర్ ఖీమా నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతుబంధు బకాయిలు చెల్లించడం, రైతు రుణమాఫీ, రైతుబీమా అమలు, యూరియా కొరత నివారణ, 24 గంటల విద్యుత్, సాగునీటి విడుదల, రైతు కూలీలు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, పెండింగ్ ఫీజుల చెల్లింపు, పెంచిన పింఛన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



**ఎమ్మెల్యేల అరెస్టుపై మెరుపు ధర్నా**
ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ నాయకులు వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట మెరుపు ధర్నా నిర్వహించి, అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

**హుస్నాబాద్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్‌గౌడ్ అన్నారు. సోమవారం వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో 4, 11వ వార్డుల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రజలంతా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



**హుస్నాబాద్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
అక్రమ అరెస్టులతో బీజేవైఎం ఉద్యమాన్ని ఆపలేరని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కర్ణకంటి నరేష్ అన్నారు. సోమవారం అక్కన్నపేట మండలంలో ఆయన మాట్లాడుతూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధించడం ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరెస్టైన వారిలో బీజేవైఎం అక్కన్నపేట మండల అధ్యక్షుడు సలేంద్ర తిరుపతి ఉన్నారు.

## హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ రాస్తారోకో



**హుస్నాబాద్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
: పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అన్యాయం చేసేలా ఉన్న జీవో 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి ఆర్డీవో రామ్మూర్తికి వినతిపత్రం సమర్పించారు. శక్తి స్కీమ్ ద్వారా పాలిటెక్నిక్ కళాశాలను విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, గడిపే సతీష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## ఎండపల్లిలో ప్రజావాణి




**ఎండపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో డి. కృపాకర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి నాలుగు వినతులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన అర్జీలను అధికారులు త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ ప్రతినిధి బి. అనసూర్య, వ్యవసాయాధికారి కే. మహేష్, వైద్యులు, విద్యాశాఖ, సీడీపీవో, సంక్షేమ, హౌసింగ్, అటవీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డీజేలపై నిషేధం

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: బచ్చన్నపేట ఎస్సై



**జనగామ/బచ్చన్నపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డీజేల వినియోగంపై ఉన్న నిషేధాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులు, సంబంధిత వ్యక్తులు, ఆపరేటర్లపై కేసులు నమోదు చేయడంతోపాటు పరికరాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో డీజే ఆపరేటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనలు, శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించకుండా బైండోవర్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

## శ్రీ సిద్ధుల గుట్ట ఆలయాన్ని సందర్శించిన డీసీపీ

### భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి: రాజమహేంద్ర నాయక్



**జనగామ/బచ్చన్నపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
: బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామంలోని శ్రీ సిద్ధుల గుట్ట ఆలయాన్ని డీసీపీ రాజమహేంద్ర నాయక్ సోమవారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ చైర్మన్ వెంకటరెడ్డి, ఈవో వంశీ, ప్రధాన అర్చకులు ఓం నమఃశివాయ ఆయనకు స్వాగతం పలికారు. ఆలయానికి భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీసీపీ సూచించారు. సోమవారం నిర్వహించే అగ్నిగుండం కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రక్షణ చర్యలు చేపట్టాలని ఎస్ఐ శ్రీకాంత్‌ను ఆదేశించారు. డీసీపీ వెంట సీఐ దేవేందర్, ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బల్లా సరస్వతికి అమెరికా ప్రతిష్ఠాత్మక లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

**జనగామ/బచ్చన్నపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
: తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, విద్యారంగానికి విశిష్ట సేవలందించిన కట్కూరు వాసి, విశ్రాంత ఉపాధ్యాయురాలు, రచయిత్రి బల్లా సరస్వతికి అమెరికాకు చెందిన నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ (నాపా) ప్రతిష్ఠాత్మక నాపా ఎక్సలెన్స్ అవార్డు--లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఉపాధ్యాయురాలిగా సేవలందించడంతో పాటు తెలుగు సాహిత్యానికి ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఆమె రచించిన 'చిట్టి చిలకమ్మా' గేయం, 'కలనేత--ఏడు తరాల కలబోత' పుస్తకాలు గుర్తింపు పొందాయి. చేనేత కార్మికుల సంక్షేమానికి 'సేవ్ ది వీవర్స్' కార్యక్రమం ద్వారా అందించిన సేవలను కూడా నాపా కమిటీ గుర్తించింది. ఈ నెల 12న అమెరికాలో జరిగే నాపా వార్షిక మహాసభలో అవార్డు ప్రదానం చేయనున్నారు. ఆరోగ్య కారణాలతో సరస్వతి అమెరికాకు వెళ్లలేకపోవడంతో ఆమె తరఫున కుమారుడు బల్ల శ్రీనివాస్ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా కట్కూరు గ్రామస్థులు, సాహితీ అభిమానులు ఆమెకు అభినందనలు తెలిపారు.



## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలి



**వీణవంక, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పి, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని వీణవంక మండలం వల్భాపూర్ మాజీ ఎంపీటీసీ జీడి దేవేందర్ డిమాండ్ చేశారు. స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. తాతా మధు వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధిష్ఠానం ఖండించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవేందర్ కోరారు.

## కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టును కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణతతో పాటు 18--45 ఏళ్ల మధ్య వయసు ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.9,750 వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు ఎల్ఎండీ కాలనీలోని ఎంఆర్సీలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. విద్యార్హత, నివాస, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల ప్రతులను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి జత చేయాలని సూచించారు. ఎంపికలో కుకింగ్ డెమో ఉంటుందని తెలిపారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన



**శంకరపట్నం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శంకరపట్నం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో కేసీఆర్, తాతా మధు పేర్లతో ప్రతీకాత్మక దిష్టిబొమ్మల శవయాత్ర నిర్వహించి, అనంతరం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ పదవికి ప్రతి రాజకీయ పార్టీ గౌరవం ఇవ్వాలని అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై జమ్మికుంటలో నిరసన



**జమ్మికుంట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జమ్మికుంట గాంధీ చౌరస్తాలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మున్సిపల్ చైర్మన్ మోలుగు ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల హక్కులను ప్రభుత్వం, పోలీసులు గౌరవించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా అభిలాష్ ఏకగ్రీవ ఎన్నిక



**ధర్మారం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి మద్దునాల మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెరువట్ల అభిలాష్, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరి మహేష్, ఉపాధ్యక్షుడిగా రెడపాక శ్రీనివాస్, కోశాధికారిగా నెరువట్ల రాకేష్, గౌరవ అధ్యక్షుడిగా వేమూర్ల అర్జయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వంతెనని నిర్మించాలని వినతి



**శంకరపట్నం, సెప్టెంబర్ 6 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ జిల్లా, శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నంలోని మల్లెపచ్చం సమీపంలో వాగుపై వంతెన నిర్మించాలని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ కొత్తపెల్లి రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసెంబ్లీ ఎలక్షన్లకి ముందు కేశవపట్నం బాబుపై వంతల నిర్మాణానికి ప్రక్రియ పూర్తయి కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం మంత్ర నిర్మాణానికి టెండర్ నిర్వహించి, వాగుపై వంతెన నిర్మించాలని కోరారు. దీంతో వాగు బయట శివారు భూముల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ఇది దశాబ్దాల నాటి రైతుల చిరకాల కోరిక అని, ప్రభుత్వం స్పందించి వెంటనే నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

## ఎమ్మెల్సీ తాతా మధు రాజీనామా చేయాలి

**స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి: దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు**

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు అన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ తాతా మధు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలు ఉన్నా రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా అవమానించడం సమర్థనీయం కాదన్నారు. తాతా మధుపై శాసనసభ నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అగ్రనేతలు స్పందించాలని డిమాండ్ చేస్తూ, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని రామారావు సూచించారు.

# ఓపెన్ ఛాలెంజ్ చేసిన ఉపాధ్యాయుడు

**ధర్మారం, సెప్టెంబర్ 7(తెలంగాణ వాణి )**
ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తానని నిరూపిస్తున్నారు రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుసముద్రాల వంశీ మోహనాచార్యులు.గత సంవత్సరం పత్రికా ముఖంగా ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ నా ప్రభుత్వ పాఠశాల పిల్లలతో మీ ప్రైవేట్ పిల్లలు పోటీ పడగలరా? గెలిస్తే 500 రూపాయలు అని ప్రైవేట్ కు పిల్లలను పంపే తల్లిదండ్రులకు సవాల్ విసిరారు. దీనికి స్పందించి 25 మంది తల్లిదండ్రులు తమ పిల్లలతో వచ్చి పోటీ పడ్డారు. కానీ ప్రభుత్వ పాఠశాల పిల్లలతో పోటీ పడలేక చివరకు వారి పిల్లలను ఇదే రచ్చపల్లి పాఠశాలలో చేర్పించారు. ఈ వినూత్న ప్రయత్నాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న అప్పటి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈ.వి. నరసింహారెడ్డి స్వయంగా ఫోన్,మెసేజ్ ద్వారా ప్రధానోపాధ్యాయులు వంశీ మోహనాచార్యులును అభినందించారు. ఈ సంవత్సరం ఓపెన్ ఛాలెంజ్ ను రూ.1000లకు పెంచారు. దీనికి ఏకంగా 45 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పోటీకి వచ్చారు. ఆశ్చర్యకరంగా ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదివే పిల్లలు సైతం రచ్చపల్లి ప్రభుత్వ పాఠశాల 2వ తరగతి విద్యార్థితో పోటీ పడలేకపోయారు. ఈ పోటీ అంతా తల్లిదండ్రుల సమక్షంలో వీడియో తీయడం జరిగింది. ప్రైవేట్ లో అధిక ఫీజులు తీసుకున్నా




క్వాలిటీ లేదని తల్లిదండ్రులే ఒప్పుకున్నారని, మీరు బాధపడకండి, మీ పిల్లలను కూడా మా పిల్లలుగా 3 నెలల్లో తయారు చేస్తాను అని ప్రధానోపాధ్యాయులు హామీ ఇచ్చారు. ఈ పాఠశాలలో 2వ తరగతి పిల్లవాడు కంప్యూటర్ ఆపరేట్ చేయడం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయడం, పాఠశాల ఆకర్షణీయమైన పెయింటింగ్ లతో చాలా చక్కగా ఉండటం, ప్రీ-ప్రైమరీలో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించడం, ప్రతిరోజూ ఒక యాక్టివిటీతో వీడియో చేయడం వంటి అన్ని అంశాల్లో పాఠశాల బాగుందని చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో జాయిన్ చేస్తున్నారు.

# ఎస్ఓటీ సిబ్బంది పేరుతో దోపిడీ

### ముగ్గురు నిందితులలో ఇద్దరు నిందితుల అరెస్ట్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 07, (తెలంగాణ వాణి):**
పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తంగి గ్రామం సనా వెంచర్ లో ఈ నెల 2 వ తేదీన మధ్యాహ్నం సుమారు 2 గంటలకు ముగ్గురు వ్యక్తులు ఎస్ ఓ టీ సిబ్బందిగా తప్పుడు గుర్తింపు చూపిస్తూ ఒక ఇంట్లోకి ప్రవేశించి, ఇంట్లో ఉన్న మహిళను బెదిరించి దాడి చేసి, రూ.70,000/- నగదును దోచుకోవడం తో పాటు, ఆమె మొబైల్ ఫోన్ ను ఉపయోగించి యూకో బ్యాంకు ఖాతా నుండి రూ.24,500/-, ఫెడరల్ బ్యాంకు ఖాతా నుండి రూ.13,000/- నగదును బదిలీ చేసుకున్న ఘటనపై పటాన్ చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సి ఐ రవీందర్ కథనం ప్రకారం... నిందితులు తాము పటాన్ చెరు ఎస్ ఓ టీ సిబ్బంది మని చెప్పి ఇంట్లోకి ప్రవేశించి, గుర్తింపు కార్డులు చూపించాలని కోరిన బాధితురాలిని బెదిరించి తల, మెడపై దాడి చేసిన అనంతరం ఇంట్లోని అల్మారా ను పగులగొట్టి నగదు దోచుకుని, ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించి అక్కడి నుండి పరారైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసుల దర్యాప్తు లో సేకరించిన ఆధారాల ఆధారంగా ఈ నెల 6 వ తేదీన ఉదయం సుమారు 6.00 గంటలకు లింగంపల్లి వద్ద ఏ-1 కొమటి విజయ్ కుమార్, ఏ-3 కెరెల్లి యాది రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను గౌరవ న్యాయస్థానం ముందు రిమాండ్ నిమిత్తం హాజరు పరుస్తున్నారు. ఈ కేసులో ఏ 2 మణి గండ్ల విజయ్ కుమార్, అలియాస్ చిన్నా పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక చర్యలు కొన సాగుతున్నాయి. దోచుకున్న నగదు పాటు బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన నగదు లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు ఎవరైనా తమను పోలీస్ లేదా ఎస్ ఓ టీ సిబ్బంది గా పరిచయం చేసుకుంటే వారి గుర్తింపును నిర్ధారించు కోవాలని, సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పటాన్ చెరు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నా

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ హామీ విలేకరి):**
కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం న్యూ హాఫీజ్‌పేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలతో అల్లావుద్దీన్ పటేల్, సంతోష్, మమత నాయకత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, బకాయిలు చెల్లించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు రంగారావు, కొమిరిశెట్టి సాయిబాబా, నవతారెడ్డి తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## చిట్యాలలో బొడ్రాయి ప్రతిష్ఠ



**మెదక్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ మండలం చిట్యాల గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బొడ్రాయిని సోమవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి ప్రతిష్ఠించారు. సర్పంచ్ శైలజ రాజా గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంతవరకు బొడ్రాయి లేకపోవడంతో నూతనంగా ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామానికి చెందిన మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థుల కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దశంకరంపేటలో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన 'చలో అసెంబ్లీ' పిలుపు నేపథ్యంలో పెద్దశంకరంపేటలో పోలీసులు సోమవారం పలువురు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు బుగుడాల కృష్ణతో పాటు ఎర్ర శ్రీహరి, చందుపట్ల అనిల్, శంకర్రావు, ధ్రువకుమార్, సాయిలు, భూషణం, సుకుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి





**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో, పారదర్శకంగా అమలు చేయాలని నాగిరెడ్డిపేట మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు సిద్దయ్య మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, రైతు బీమా తదితర హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీవోను కోరారు. హామీలను అమలు చేయకపోతే మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## రాజీవ్ రహదారిపై ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 7, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కాంగ్రెస్ పాలనలో వెయ్యి రోజుల్లో అభివృద్ధి శూన్యమని మండిపడుతూ సోమవారం తిమ్మాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. రాజీవ్ రహదారిపై మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మను దహనం చేసి, ఎంపీడీవోకు ప్రజావాణిలో దరఖాస్తులు అందజేశారు.రాష్ట్ర నాయకుడు ?కేతిరెడ్డి దేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.మండల అధ్యక్షుడు ?రావుల రమేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందక తిమ్మాపూర్‌లో అభివృద్ధి కుంటుపడిందని, వ్యక్తిగత విమర్శలు మాని ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు.రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం మాట్లాడుతూ కేసీఆర్ నాటి సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో పాశం అశోక్‌రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, ఎడ్ల బుచ్చిరెడ్డి, వంతడుపుల సంపత్, నోముల రాజేష్ గౌడ్, తిరుపతిగౌడ్, సంగుపట్ల మల్లేశం, కొయ్యడ మురళీ, కొండ్ర రాజు, దాడి ఓదెలు, గూడ తిరుపతి, బొర్ర రవీందర్, రంగు కార్తీక్, గడ్డి రమేష్, సుధగోని సదయ్య తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల వృత్తి విద్య శిక్షణ అభినందనీయం

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: దివ్యాంగులకు వృత్తి విద్యతో పాటు స్వయం ఉపాధి శిక్షణ అందించడం అభినందనీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ అన్నారు. సోమవారం ఎల్ఎండీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలోని దివ్యాంగుల పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులు తయారు చేస్తున్న పేపర్ ప్లేట్లు, చాక్‌పీసులు, క్యాండిల్స్, ఫినాయిల్ తదితర వస్తువుల తయారీని పరిశీలించి అభినందించారు. దివ్యాంగులకు అంకితభావంతో సేవలందిస్తున్న ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిబ్బందిని ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ బాల్‌రాజ్, ప్రిన్సిపాల్ నాంపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, కేసీఆర్, తాతా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాతా మధు వెంటనే స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో సంక్షేమానికి పెద్దపీట



**నర్సాపూర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం నర్సాపూర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో మహిళలకు సముచిత గౌరవం లభిస్తోందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అప్పులు పెరిగాయని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, పేదలకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై మెదక్ రైతుల ఆసక్తి



**మెదక్, సెప్టెంబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో రైతులు సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ తెలిపారు. సోమవారం కొల్చారం మండలం తుక్కాపూర్‌లో దుర్గారాణి వ్యవసాయ భూమితో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 29 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు నీటి వసతి ఉన్న భూములు అనుకూలమని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, నాణ్యమైన మొక్కల సరఫరా, సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రతాప్‌సింగ్ సూచించారు. జిల్లాలో 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పంట సాగు విధానం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణపై అధికారులు మార్గదర్శకత్వం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసచారి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నీటి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి




**చిట్యాల, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో ప్రజావాణిలో ఎంపీడీవోకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. మల్లయ్య మాట్లాడుతూ గత 15 రోజులుగా పలు గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు, మహిళలు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయాలను తొలగించి ప్రత్యామ్నాయంగా బావుల ద్వారా నీటిని అందించాలని కోరారు. రాత్రివేళల్లో విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే మహిళలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కట్కూరి రాజు, గురుకుంట్ల కిరణ్, గుర్రం తిరుపతి, మైదం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో కళ్యాణి మల్లాదికి పీహెచ్.డీ.



**పటాన్ చెరు, సెప్టెంబర్ 7, (తెలంగాణ వాణి):**
హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కళ్యాణి మల్లాది డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'కొత్త పైరిమిడిన్ ఆధారిత కార్బోసైక్లిక్ న్యూక్లియోసైడ్, ఫ్యూజ్డ్ హెటెరోసైక్లిక్ ఉత్పన్నాలు: సంశ్లేషణ, ఇన్-సిలికో, మధుమేహ నిరోధక, సూక్ష్మక్రిమి నిరోధక మూల్యాంకనం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, మధుమేహ నిరోధక, సూక్ష్మజీవ నిరోధక అనువర్తనాలకు సంభావ్యత ఉన్న నూతన పిరిమిడిన్-ఆధారిత సమ్మేళనాల అభివృద్ధిని అన్వేషిస్తుందని తెలియజేశారు. ఈ అధ్యయనం అనేక ఆశాజనకమైన --గ్లూకోసిడేస్ నిరోధకాలను గుర్తించిందన్నారు. వీటిలో ఎంపిక చేసిన సమ్మేళనాలు బలమైన నిరోధక చర్యను, అనుకూలమైన మాలిక్యులర్-డాకింగ్ ప్రొఫైల్స్ ను, గణనీయమైన యాంటీ బాక్టీరియల్ చర్యను, ఆశాజనకమైన డ్రగ్-లైక్ నెస్, ఏడీఎంఈ, టాక్సిసిటీ లక్షణాలను ప్రదర్శించినట్టు తెలిపారు. మధు మేహం, సూక్ష్మజీవుల సంక్రమణలకు సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన చికిత్సా అభ్యర్థుల కోసం జరుగుతున్న అన్వేషణకు ఈ పరిశోధన దోహదపడుతుందని వివరించారు. డాక్టర్ కళ్యాణి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పరిశోధనకు ఆమె చేసి గణనీయమై కృషిని అభినందించినట్టు తెలిపారు.

## మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు సిగ్గుచేటు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపు మేరకు జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గూడెం మధుతో కలిసి బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి హాజరు కావడం నేరమా? అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటని విమర్శించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాయకూడదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై బీజేపీ పోరు.. నేతల అరెస్ట్



**కరీంనగర్‌టౌన్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నిర్వహించిన 'ఫీజు బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో అసెంబ్లీ'కు తరలివెళ్తున్న కరీంనగర్ జిల్లా బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌లో అసెంబ్లీ కో-కన్వీనర్ గుర్రం వెంకటేష్‌గౌడ్‌ను కూడా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.15 వేల కోట్లకు చేరాయని ఆరోపించారు. బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ దారవేణి సాయికుమార్



**పెద్దపల్లి , సెప్టెంబర్ 7(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
అంతర్గాం మండలం విస్సంపేట గ్రామంలో దారవేణి నాగరాజు--లత దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విస్సంపేట గ్రామ సర్పంచ్ దారవేణి సాయికుమార్--సింధు దంపతులు హాజరై, నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇంటిలో నాగరాజు--లత దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సమృద్ధులతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం అవుతుండటం అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు. గృహప్రవేశ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎఫ్ఎల్ఎన్ పకడ్బందీగా అమలు చేయాలి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
: అన్ని పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి సూచించారు. సోమవారం పటాన్‌చెరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు అన్ని తరగతి గదుల్లో బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు టీచింగ్--లెర్నింగ్ మెటీరియల్‌ను తప్పని సరిగా వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్ నాయక్, హెచ్‌ఎం సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**రాయికోడ్ :సెప్టెంబర్ 07(తెలంగాణ వాణి ప్రతినిధి )**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో సోమవారం నాడు గ్రామ సర్పంచ్ పత్ర తులసి హన్మంతు ఆధ్వర్యంలో,ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన పలు లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరిగింది. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు మాలెగోదల యేసయ్య, భారతమ్మ లు కలిసి 52వేయిలు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భారతమ్మ,పంచాయతీ కార్యదర్శి అనిల్,వార్డ్ సభ్యులు మణెమ్మ మ్యాతరి శ్యామమ్మ, చాకలి బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## నగునూరి రామ గౌడ్ పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



**జగిత్యాల/ బుగ్గారం:07 సెప్టెంబర్ (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం కేంద్రానికి చెందిన బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ తండ్రి మాజీ ఎంపీ టీ సీ నగునూరి రామగౌడ్ ను ఇటీవల అనారోగ్యం కారణంగా హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ జువ్వాడి కృష్ణా రావు ఇంటికి వెళ్లి పరమార్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హిటాచి మనీ స్పాట్ ఏటీఎంను ప్రారంభించిన రవి యాదవ్



**హైదరాబాద్/ శేరిలింగంపల్లి సెప్టెంబర్07 (తెలంగాణవాణి విలేకరి)**
లింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీలో కాలనీ, ఆటో స్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిటాచీ మనీ స్పాట్ ఎటిఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ హాజరై ఎటిఎం కేంద్రాన్ని ప్రారంభించారు. హిటాచీ మనీ స్పాట్ ఎటిఎం నిర్వాహకులు రేవళ్ల రాజేష్ సుజిత్ రవి యాదవ్ ని ప్రత్యేకంగా ఆహ్వానించగా, వారి ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమంలో పాల్గొని నూతన ఎటిఎం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి యాదవ్ రాజేష్, సుజిత్ కి అభినందనలు తెలియజేస్తూ, నూతనంగా ప్రారంభించిన ఎటిఎం కేంద్రం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలు






**నాంపల్లి:సెప్టెంబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాంపల్లి మండలం లోని ముష్టిపల్లి గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా పెద్దమ్మ పండుగ నిర్వహించారు, సోమవారం నాడు ఆఖరి రోజున ఘనంగా బంధు మిత్రులతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్నటువంటి అన్ని గ్రామ దేవతలకు నీరారపోస్తు అన్ని దేవతల దీవనెలు తీసుకున్నారు,అలాగే సమృద్ధిగా వర్షాలు కురవాలని పంటలు మంచిగా పండి రైతులు లాభాలు పొందాలని మొక్కుకుని డప్పు సప్పులతో గ్రామంలో మొత్తం మూడు రోజులు సందడి చేశారు,యాదవుల మొక్కుకున్న మొక్కలన్నీ నెరవేర్చాలని వనమాసం వెళ్ళి పండుగ వాతావరణాన్ని ముగించారు. పండుగ ముగిసిన కొద్దిసమయంలోనే వర్షం రావడం గ్రామస్థులందరు ఆనందం వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో యాదవ సోదరులు, మరియు బంధుమిత్రులు,గ్రామస్థులు యువకులు, ఆడపడుచులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ప్రజావాణిలో వినతి



**నాంపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల నాయకులు సోమవారం నాంపల్లిలో ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణికి వినతిపత్రాలు అందజేశారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరారు. నాంపల్లి--మల్లేపల్లి డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, మునుగోడు ప్రాంతంతో పాటు నాంపల్లి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నరసింహారావు, నాయకులు పోగుల వెంకట్‌రెడ్డి, కడారి శ్రీశైలం, నడింపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ప్రజా పాలనకు వేయి రోజుల మహా ర్యాలీ

**దేవరకొండ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుంచి సుమారు 2,000 బైకులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేవరకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం--మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై బస్టాండ్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు

## అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు ఇవ్వాలి



**కరీంనగర్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
ఎస్ఐఆర్ ప్రక్రియలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పకడ్బందీగా విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు తమ వివరాలు సమర్పించేందుకు, విచారణలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ప్రతి కేసు వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, పారదర్శకంగా నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా పాల్గొని జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.



**పెద్దపల్లి , సెప్టెంబర్ 7(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, వృద్ధులు, పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల సంతోష్, మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, పెద్దంపేట సర్పంచ్ ఆముల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి ప్రవీణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఆరు అర్జీలు




**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండల స్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో, మండల నోడల్ అధికారి వోదెల రామకృష్ణ తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు మూడు, మున్సిపాలిటీకి ఒకటి, వ్యవసాయ శాఖకు ఒకటి, పంచాయతీ శాఖకు ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన అర్జీలను నిబంధనల మేరకు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

## దుర్గమ్మ శాశ్వత షెడ్ నిర్మాణానికి భూమిపూజ.

### ఏబీసీ శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం.



**పెద్దపల్లి , సెప్టెంబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలోని దుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న శాశ్వత షెడ్‌కు సోమవారం భూమిపూజ నిర్వహించారు. షెడ్ నిర్మాణ బాధ్యతలు స్వచ్ఛందంగా చేపట్టిన ఏబీసీ శ్రీనివాస్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా సన్మానించారు. ఎండ, వర్షాల నుంచి భక్తులకు రక్షణ కల్పించేందుకు శాశ్వత షెడ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్మాణ పనులు త్వరగా పూర్తి కావాలని దుర్గమ్మ తల్లిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మ హత్య

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 7, (తెలంగాణ వాణి):**



తన భార్య బాయి కాడి దీప తో కుటుంబ సమస్యల విషయంలో గొడవపడి, మనస్తాపం చెందిన పెద్ద శంకరం పేట కు చెందిన బాయి కాడి భాస్కర్ (39) ఆత్మ హత్య కు పాల్పడినట్లు స్థానిక ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. పెద్ద శంకరం పేట కు చెందిన భాస్కర్ పట్టణం లో అవుసుల పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇంట్లో బార్య దీప, పిల్లలతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో మన స్థాపం చెందిన భాస్కర్ గ్రామ శివారు లోని రేగోడ్ రోడ్ లోని చెట్టుకు ఉరి వేసుకుని చని పోయినాడన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు సంతానం ఉన్నారు. మృతుని అన్న బాయ్ కాడి శ్రీనాథ్ పిర్యాదు మేరకు ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్టీఆర్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్..

భారీ సెట్‌లో ఇద్దరు హీరోయిన్లతో మాస్ ట్రీట్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డ్రాగన్' లేదా 'బ్రూస్ లీ' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి సినిమాలతో తనదైన యాక్షన్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ అవుతోంది. సినిమా కోసం ఓ భారీ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు భారీ విజువల్స్‌కు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. అదే తరహాలో ఎన్టీఆర్ సినిమాకు కూడా ఆయన స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నట్లు టాక్.ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. పాటలో కనిపించే విజువల్స్ ప్రేక్షకులకు థియేటర్‌లో మాస్ ట్రీట్ ఇచ్చే విధంగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సినిమా కథ, యాక్షన్‌తో పాటు ఈ పాట కూడా హైలైట్‌గా నిలిచేలా ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్‌లో ఎన్టీఆర్‌తో పాటు సినిమాలో కథానాయికలుగా నటిస్తున్న రుక్మిణీ వసంత్, మరో హీరోయిన్ కూడా కలిసి స్టెప్పులు వేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది.

ఎన్టీఆర్‌కు మాస్ డ్యాన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీంతో ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ మేకింగ్‌కు ఎన్టీఆర్ డ్యాన్స్ జోడైతే ఈ పాట అభిమానులకు పండుగలా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.ముఖ్యంగా భారీ సెట్స్, గ్రాండ్ కొరియోగ్రఫీ, స్టార్ హీరోతో పాటు ఇద్దరు హీరోయిన్ల పెర్ఫార్మెన్స్‌తో ఈ సాంగ్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తారనే విషయం తెలిసిందే. ఈసారి ఎన్టీఆర్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కథలోని యాక్షన్ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, భారీ సెట్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలుస్తాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్.

# 'ఇరుముడి' నుంచి 'కార్తీకమాసం' వీడియో సాంగ్ విడుదల!




మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' నుంచి మరో క్రేజీ పాట విడుదలైంది. ఇప్పటికే "మల్లెపూల పల్లకి" వీడియో సాంగ్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా మరో పాటను వదిలారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందించిన 'కార్తీకమాసం..' అంటూ సాగే పూర్తి వీడియో గీతాన్ని చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ఆధ్యాత్మిక ప్రియులను, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రవితేజ పాత్రలో వచ్చే భావోద్వేగాలు, జీవితంలో అలవాటైన చెడు వ్యసనాలను పూర్తిగా మానుకొని, కఠినమైన అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో ఎలా కొనసాగించారనే పట్టుదలను ఈ పాటలో దర్శకుడు చాలా చక్కగా చూపించారు. ఒక వ్యక్తి తన అంతరాత్మతో పోరాడుతూ ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేసే ప్రయాణానికి ఈ పాట అద్దం పడుతోంది. సినిమాలోని కథాబలానికి ఈ గీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తాజా వీడియో చూస్తే స్పష్టమవుతోంది.

సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. హృదయానికి హత్తుకునేలా ఉన్న ట్యూన్స్‌తో పాటు, ఈ పాటకు స్వయంగా దర్శకుడు శివ నిర్వాణ అందించిన సాహిత్యం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి భావాలతో పాటు జీవిత సత్యాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ పదాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రవితేజ నటన, జీవీ ప్రకాష్ సంగీతం, శివ నిర్వాణ సాహిత్యం-దర్శకత్వం అన్నీ కలిసి ఈ పాన్ని ఒక మ్యూజికల్ మాస్టర్‌పీస్‌గా మలిచాయి.

# ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు..

అలా చూపిస్తే ఒప్పుకోను..!

కాయదు లోహర్ షాకింగ్ కామెంట్స్



ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకోలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

అస్సాంలో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్' పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో 'ముగిల్‌పేటే' చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ ..

# నాని 'ది పారడైజ్' విడుదల వాయిదా?

మళ్లీ మారనున్న రిలీజ్ డేట్!



నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' విడుదల తేదీపై ఫిలింనగర్‌లో రకరకాల చర్చలు జరుగు తున్నాయి. మొదట ఈ సినిమాను సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావించినప్పటికీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు వీఎఫ్ఎక్స్ వర్క్స్ కారణంగా ఈ మూవీ రిలీజ్ మరోసారి వాయిదా పడనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. సెప్టెంబర్ 24 నుంచి ఈ చిత్రాన్ని వెనక్కి జరిపి అక్టోబర్ 9వ తేదీకి విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఫిలిం సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ వాయిదా వార్తలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పష్టత రాలేదు. త్వరలోనే దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# 'మండాడి' ట్రైలర్ విడుదల!



కోలీవుడ్ నటుడు సూరి హీరోగా, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ విలన్ పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'మండాడి'. సముద్రం నేపథ్యంలో రాబోతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను 'సెల్ఫీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. తమిళనాడులోని తీర ప్రాంతాలకు చెందిన సాంప్రదాయ బోట్ రేస్ పోటీల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సముద్రం నేపథ్యంలో సాగే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఇది రూపొందుతోంది. ఇందులో సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, తెలుగు నటుడు సుహాస్‌తో పాటు ప్రముఖ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ సినిమా కోసం హీరో సూరితో పాటు నటుడు సుహాస్ ఎలాంటి బాడీ డబుల్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాలు, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో చాలా కష్టపడి నటించినట్లు తెలుస్తుంది.

# అంతా రాములోరు చూసుకుంటారు..

గోదావరి నేపథ్యంలో సంగీత్ శోభన్ కొత్త సినిమా!




యంగ్ హీరో సంగీత్ శోభన్ వరుసగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఇప్పుడు ఆయన మరో ఆసక్తికరమైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో మాలీవుడ్ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది.అందమైన గోదావరి ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'అంతా రాములోరు చూసుకుంటారు' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను చిత్రబృందం తాజాగా ప్రకటించింది. టైటిల్‌తో పాటు విడుదల చేసిన ప్రచార వీడియో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

ఈ సినిమాలో సంగీత్ శోభన్ మారుతి అనే పాత్రలో కనిపించనుండగా, అనస్వర రాజన్ శిరీష పాత్రలో ప్రేక్షకులను పలకరించనుంది. సాధారణ ప్రేమకథలా కాకుండా వీరిద్దరి మధ్య జరిగే ఓ అందమైన సంభాషణతో సినిమా కథ సాగుతుందనే సంకేతాలను మేకర్స్ ఇచ్చారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తికరంగా "నాట్ ఎ లవ్ స్టోరీ" అంటూ ప్రమోట్ చేస్తున్నారు. దీంతో అసలు మారుతి, శిరీషల కథ ఏమిటి? వారి ప్రయాణంలో ఎలాంటి మలుపులు ఉండబోతున్నాయి? అనేది ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గోదావరి ప్రాంతం, అక్కడి సంస్కృతి, పల్లెటూరి వాతావరణం నేపథ్యంలో ఈ చిత్రాన్ని అందంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఫీల్‌గుడ్ కథతో పాటు సహజమైన భావోద్వేగాలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర యూనిట్ చెబుతోంది.


Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com